UNIVERSAL LIBRARY
OU_204457
UNIVERSAL LIBRARY

# నక్షత్రమాల.

దువ్వూరి రామిరెడ్డిగారిచే రచియింపఁబడి
ప్రకటింపఁబడినది.


చెన్నపురి;

వావిళ్ల ప్రెస్సున
ముద్రితము.

1921.



[స్వామ్యసంకలితము.]


[వెల 0-12-0.

"Poetry has been to me its own exceeding great reward. It has soothed my offlictions; it has multiplied and refined my enjoyments; it has endeared solitude; and it has given me the habit of wishing to discover the good and beautiful in all that meets and surrounds me."

COLERIDGE.

# విషయసూచిక.


| విషయము. | పుటం. |
|---|---|
| ఉపోద్ఘాతము ... ... | 1 |
| కవిమనోరథము ... ... | 1 |
| ప్రణయాంజలి ... ... | 3 |
| సంధ్య ... ... | 6 |
| కవి ... ... | 8 |
| కుసుమాశ్రువులు ... ... | 10 |
| రెడ్డికులప్రబోధము ... ... | 12 |
| సోదరీస్మృతి ... ... | 13 |
| కోయిల ... ... | 20 |
| స్వాతంత్ర్యరథము ... ... | 21 |
| ప్రణయాహ్వానము ... ... | 24 |
| కొండవీడు ... ... | 26 |
| కవితాప్రణయిని ... ... | 31 |
| ద్రౌపదీసందేశము ... ... | 36 |
| దుర్యోధనుఁడు ... ... | 40 |
| రాధ యుత్కంఠ ... ... | 43 |
| ఎంతమోసము ... ... | 46 |
| అజ్ఞాతకవి ... ... | 49 |
| జాతీయగీతము. ... ... | 50 |
| రాట్నపుపాట ... ... | 52 |
| ఏలపాట ... ... | 54 |

# శుద్ధపత్రము.

---

| పుట. | పద్యము. | పాదము. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|---|
| 9 | 2 | 1 | చరితారహాస్యంబు | చరితరహాస్యంబు |
| 32 | 2 | 4 | భిక్షంబువెటి | భిక్షంబువెట్టి |
| 38 | 4 | 2 | మబనినిపై | మజ్జవనిపై |
| 41 | 2 | 3 | క్షత్రియునకు | క్షత్రియుఁడు |
| 47 | 4 | 3 | కొఁబూలమాల | క్రొంబూలమాల |
| 48 | 2 | 2 | యింద్రధనన్సు | యింద్రధనుస్సు |
| 49 | 1 | 2 | ఁగుందు | నేడు |

ఈక్రిందిగీతమును [illegible]4-వ పుటయందు ఏడవపద్యముగఁ బఠియింపవలయును.

సందెమబ్బుల చిఱువేరు చాయతీసి
పండువెన్నెల పసరునఁ బదనుచేసి
తరుణి, నీపట్టు ముసుఁగు నద్దకము వైవ
విఫల యత్నంబులం జల్పి వెఱ్ఱినైతి.

# ఉపోద్ఘాతము.

మానవహృదయమును దైనిక కలకలమునుండి తొలగించి విషయభార విముక్తముచేసి, ప్రాపంచిక సీమాంతముల కవ్వల భావసృష్టికల్పితమైన నక్షత్రమండలమున సంచరింపఁజేయుటకు శిల్పము సహాయకారి. శిల్పములలోఁ బ్రతిక్షణ భావనవ్యతకు వాలవాలమైనది కావ్యశిల్పము. ఇతర శిల్పములకును గావ్యశిల్పమునకును జాలవ్యత్యాసముగలదు. ఒక చిత్రపటమును దర్శింత మనుకొనుఁడు. ఆ పటమునందు ఒక్కభావము, ఒక్కస్థితి, యొక్కవిధమైన రసానుభూతి యలవడును. కాని, కావ్యశిల్పమునం దిట్టినిశ్చలత యుండదు. అనుక్షణము భావములు పరిసరదృశ్యములు అనుభూతియు మెఱుగుతీఁగవలె మాఱుచుండును. కావ్యమును ఇప్పటి "సినమెటోగ్రాఫు" నకుఁ బోల్పవచ్చును.

కవులు సృష్టికర్తలు. వీరి ప్రధానకార్యము సృష్టి. ఇట్టి సృష్టివలనఁ బ్రయోజన మేమియని కొందరుముగ్ధహృదయులు,కొందరు శుష్కరసహృదయులు ప్రశ్నింపవచ్చును. కావ్యసృష్టివలన నమూల్యమైన ప్రయోజనముగలదు. కా

మణీయకము పరిపూర్ణముగ వికసింపని యీప్రపంచము నుండి, సర్వతోముఖ రమణీయమైన కల్పనా ప్రపంచ మున, గంగాతరంగ శీతలవాఃకణ పూరితమును, నందనవన సద్యోవికసిత కుసుమ సౌరభ్య పులకితమునగు మందమా రుత స్వాప్నికడోలికల రసార్ద్రమైన మానవహృదయమును గావ్యము ఉయ్యెలలూపుచుండును.

శంపాలతాంగిని అమృతాంశుముఖిని ప్రకృతి ఇంతవఱ కు సృజింపలేదు. కాని శిల్పియుఁ గవియు సృజించిరి. ప్రకృతి లోపమును బూరించుటయే కళయొక్క ముఖ్య ప్రయోజ నము. వివిధవస్తు సంయోగమునందు బ్రకృతికన్నను గవులు ముందంజ వేసియున్నారు. "చలువగల వెన్నెలలచెలువునకు సౌరభముగలిగినటు" "Melody of flowers" మున్నగుకల్పన లిందునకుఁ దార్కాణములు. కావ్యము ఆనందమయము. కావుననే యానంద దాయకము. కావ్య ప్రయోజనము లలో "సద్యః పరనిర్వృతయే" అనులాక్షణిక నిర్వచనము ప్రధానమైనది.

నిజమైన కవిత్వము ఆకృతిబద్ధముగాదు. ఏయాకృతియుఁ గవితారసప్రవాహమును బట్టియుంచలేదు. మూర్తీభవిం పని కవిత్వమే అప్పటమైనకవిత్వము. ఈ కవిత్వము ఏకాంతమునందు రసార్ద్రమైన మానవహృదయముచే నను

భవింపఁ బడుచున్నది. ప్రశాంతమను అక్షరములతో వ్రాయఁబడిన యీ కవిత్వమందుఁ జెవికి వినబడని గానమున్నది. ఈ గానమనోహరత్వమును మార్దవమును గర్ణేంద్రియ సహాయములేక హృదయమే స్వయముగ ననుభవించుచున్నది. కావుననె "నొ గూచి" యను జపాను దేశపుఁ బ్రఖ్యాతకవి "వ్రాయబడిన కవిత్వమున కన్నను వ్రాయఁబడని కవిత్వమే మధురమైన" దని నుడివియున్నాఁడు. "కీట్సు" అను నాంగ్లేయ కవియు, "Heard melodies are sweet, but those unheard are sweeter.—అని వ్రాసియున్నాఁడు. కవి యనుభవించు ఆనందము ఆతని భావవీథినిఁ బొడకట్టుదృశ్యము, స్థూలమైన భాషయందు గర్భీకరింపఁబడినపుడు ఆత్మసౌందర్యమును సగము కోలుపోవును. ఎందు వలన ననగా భావములు సున్నితములైనవి. భాషస్థూలమైనది. కావునఁ గవిత్వమునందు అంతర్వ్యాఖ్యాతమైన భాషకొంతయు బహిర్వ్యాఖ్యాతమైన భాష కొంతయు సమ్మిళితమై యుండును. కవిత్వమును నిఘంటు మూలమునఁ దెలిసికొనఁ గోరు నతఁడు రసవిహీనమైన శల్యపంజరమును మాత్రము చూడగల్గును. కాని యందలి యానందమును సౌందర్యమును ననుభవింపలేడు. కవిత్వమందలి ప్రతి పదముచుట్టును నిఘంటువు నిర్ణయమున కతీతమైన భావరోచి యావరించియుండును.

పద్యములు భావప్రేరకములు. భావములు ప్రతిబింబించుటయు, విరివియగుటయుఁ, బాఠకుని హృదయసంస్కారము ననుసరించి పరిపరి విధములుగ నుండును. కావుననే పాఠకులుకూడ కవులవలెనే రసార్ద్ర హృదయులుగా నుండవలయుననుట. తామరపాకుపైఁ జెరలాడు మంచుబొట్టు ప్రొద్దుపొడుపు మొదలు ప్రొద్దెక్కు కొలఁది కిరణవర్ణభేదముల ననుసరించి బహువర్ణములు దాల్చునట్లు పాఠకుల సంస్కారభేదముల ననుసరించి కవితయు వివిధాకృతులతోఁ బొడకట్టుచుండును. ఇందుకు క్రింది దృష్టాంతము గనుఁడు. సూర్యుడ స్తమించెను. సంజ కెంజాయలు జలదశకలములపై నలమికొని పశ్చిమదిశను నొక చిత్రప్రదర్శన శాలగ మార్చివైచెను. వరిచేలు పండి యొరగి చల్లగాలికి సను ప్రతరంగములవలె నల్లనల్లన నాడుచుండెను. ఇట్టి దృశ్యమును నొక చిత్రకారుఁడును మఱియొక పల్లెటూరి కాఁపును సందర్శించుచుండిరను కొందము. చిత్రకారుని చిత్తము ఊహాతీతమైన యావర్ణసమ్మేళనముయొక్క సౌందర్యమున నిమగ్నమయి పోయియుండును. కాఁపువాని హృదయము బంగారు టెనుకవలె పండి యొరగియున్న వరిచేనుగాంచినంత ఉవ్విళ్లూరుచుండును. ఆతని మనము నాకర్షించుటకుఁ బడమటిదెసయందేమియును వింత తోఁపలేదు. దృశ్య మొక్కటియే యైనను, వారిహృదయఫలకములందు భిన్నముగఁ బ్రతిఫలించెను.

పూర్వులలోఁ గొందరు కవిత్వమును శాస్త్రముగఁ బరిగణించిరి. ఇదిచాల గొప్ప పొరపాటు. శాస్త్రమున నానందము లేదు. నగ్న సత్యము కలదు. శాస్త్రకారునికిని శిల్పికిని జాల వ్యత్యాసము గలదు. వారి మార్గములు ధ్రువములవలెఁ బరస్పర భిన్నములననిన సత్యబాహ్యముగాదు. కవియును శాస్త్రకారుఁడును ఒక హృదయమును బరీక్షింపవలసిన యెడల కవి రసము, అనుభూతి, భావము మున్నగు వానికై వెదకుచుండును. శాస్త్రకారుఁడా హృదయమునుగోసి అందెన్ని క్రోవ లున్నవి, ఎన్ని యరలున్నవి, నెత్తురేమార్గమున సంచరించునను విషయములను బరీక్షించుచుండును.

తెలుగు కవులలోఁ, గవిత్వము శిల్పమని ప్రథమముననఁ గనిపెట్టిన తత్త్వవేది మహాకవి తిక్కన. కావుననే యాకవి బ్రహ్మ "కవిత్వ శిల్పమునం బారగుఁడ" అని చెప్పుకొని యున్నాఁడు.

స్వాతంత్ర్యమునఁ గొంత సాహసముగలదు. సాహసమనునది మానవప్రకృతిని నవీనమార్గావలంబనమునకుఁబురికొల్పును. మానవ సంఘము రాజకీయ సాంఘిక మత నైతిక దాస్యమునంబడి యాచారశృంఖలల మూలమున యంత్రచలితమగు నొక ప్రతిభాశూన్య విగ్రహామువలె నున్నపుడు అట్టి సంఘముయొక్క మనము నవీనకల్పనలకుఁ జాలఁ

బాఱదు. ఆ స్థితినిఁ గల్లోలించి భావదాస్య భారమున మ్రగ్గుచున్న హృదయమునకు విశాల ప్రపంచ దృశ్యము కనఁబడునట్లు విప్లవము జరుగనిదే మానవప్రకృతి నిర్నిద్రము గాదు. కృష్ణదేవరాయల కాలమునందు నూత్న కావ్య సృష్టికింగూడ నీలాటి విప్లవమే కారణము.

ప్రపంచ చరిత్రమును బరిశోధించి చూచినయెడల, పూర్వులకు భవిష్యత్సంతతివారిని దమతమ అభిప్రాయాచార మార్గమున బంధించు చాపల్యము అమితముగ నుండినట్లు దోఁచుచున్నది. ఇట్టి యధికార చాపల్యము అన్ని మానవజాతులలోనునున్నది. ఇది యసంగతమే గాక హాస్యాస్పదమును. ఇట్టి యారోపితాధికారము మత సాంఘిక రాజకీయ విషయములందే గాక కవిత్వమునం గూడ నాటుకొనియుండినది. కావ్యలక్షణము ప్రథమమునఁ గవుల రచనలనుండియే యుద్భవించిన దయ్యుఁ బ్రత్యేక లాక్షణికుల యధికారముద్రవలన ఆలక్షణమే కవులను నిగళబద్ధులను గావించినది.

కావ్యములలో నేయేవర్ణనము లుండవలసినదియు నెట్టినాయికా నాయకులుండవలసినదియు లాక్షణికులే తీర్మానించిరి. కాన కవిసృష్టికిఁ గొన్ని హద్దు లేర్పడినవి. పూర్వకవులకు రాజులే యాశ్రయులు. రాజులు పండితులను సులోచన

ములు మూలమునఁ గావ్యపరీక్ష గావించుచుండిరి. ఇఁకఁ బండితులు రసార్ద్రచిత్తముతోఁ గాక శుష్కమైనలాక్షణిక మానదండముతోఁ గావ్యశిల్పమును గొలతవేయుచుండిరి. లాక్షణిక ప్రమాణమునకు వెంట్రుకవాసంతతగ్గినను ఆ కావ్యము గ్రాహ్యముగాదు. కావుననే యాంధ్రప్రబంధము లన్నియు నొకే యచ్చున గ్రుద్దినట్లు లొకేతీరున నున్నవి. ఒక కావ్యమును సాంతముగఁ జదివిన మఱియొక కావ్యము ను జదువనవసరముండదు. అదేనాయిక; అదేనాయకుఁడు; అదే యుద్యానవనము; అదేనూహము; అదే విరహము; అదేశీతలోపచారము; అదే చలికత్తె; అదేసూర్యోదయ ము అస్తమయము!

కాని యిప్పటి కాలస్వభావము, పరిస్థితులు మాఱినవి. ముద్రణయంత్రములు కాగితములు ప్రబలినవి. కావున గ్రంథములు సర్వజనసామాన్యమునకు సులభ్యములగుచున్న వి. ఇప్పుడు కవులను బోషించు వారు ప్రజలు. ప్రజల యభిరుచియుఁ గవుల యభిరుచియు మాఱినది. ఇందుకుఁజాల చారిత్రక కారణములుగలవు. పాశ్చాత్య సారస్వత సంబంధ మువలనను, తన్నాగరకతా సంపర్కమువలనను ప్రజల భావములు ఆదర్శములు మాఱఁజొచ్చినవి. సంఘమునందుఁ గొంత జీవచలనము ప్రారంభమయినది. ఈనవీనపరిణామము

కవుల హృదయములఁ బ్రతి ఫలించి ఆంధ్రసారస్వతము నఁ జొచ్చినది. కావుననే నేఁడు హృదయమోహనమైన అధునాతన సారస్వతము తఱితీపు తెలుగునందు బయలు దేఱినది.

ఈ గ్రంథమున సమకూర్పఁబడిన ఖండకావ్యములలోఁ జాలవఱకుఁ గృష్ణాపత్రిక, ఆంధ్రపత్రికా సంవత్సరాది సంచికలు, న్యాయదీపిక మున్నగు వార్తా పత్రికలలో నిదివఱకుఁ బ్రకటింపఁబడినవి. నేను పద్యములు పంపినవెంటనే నన్నుఁ బ్రోత్సహించుటకుఁ గాను అప్పుడప్పుడే తమపత్రికలలోఁ బ్రకటించుచుండిన యాయాపత్రికాసంపాదకులకు నేనెంతయుఁ గృతజ్ఞుఁడను.

ఈకావ్యములను నేనువిమర్శింపఁబూనుకొనలేదు. కవియే తాను రచియించినకావ్యములను, విమర్శకుఁడుగ నవతారమెత్తి పరిశీలించుట యసంభవము. స్వాభిమానము వలన ననవసరప్రశంస గావించుకొనుటయో లేక వినయము వలన ఉచిత ప్రశంస చేయకుండుటయో సహజముగఁ దటస్థించును. కావున నీకావ్యములయొక్క గుణాగుణవిమర్శనము రసైక పక్షపాతులైన సహృదయులకు వదలుచున్నాను.

కవులయెడ సమకాలికులకు నిరాదరణము అన్నిదేశములందును అన్నికాలములందును ఉండినట్లు తోఁచుచున్నది.

ఈర్ష్యయుఁ "దనపెరటిచెట్టు మందుగాదు"నెడు సామాన్య జనులమన స్తత్వమును, బరిచయమువలనఁ గలుగు నౌదాసీన్యమును ఇందుకుఁ గారణములుగ నుండవచ్చును. "సమకాలికు లెన్నడు మెచ్చరేగదా" యని చేమకూరు వెంకన్న వ్రాసిన యీ చిన్ని వాక్యమునందు ఆతని హృదయ వేదన యంతయు నిమిడి యున్నది. సమకాలికులచే నిరాదరింపఁబడిన మహాకవి భవభూతియొక్క వేడినిట్టూర్పులు

యేనామకేచిదిహ నః ప్రథయం త్యవజ్ఞాం
జానంతి తే కిమపి, తాన్ప్రతినైష యత్నః
ఉత్పత్స్యతేఽస్తి మమకోఽపి సమానధర్మా
కాలోహ్యయం నిరవధి, ర్విపులాచపృథ్వీ.

అనునీశ్లోకమునందు నేఁటికిని ఆవిర్లువాఱుచున్నవి. తానురచియించిన "ఇస బెల్లా" యనుకావ్యముపై దాడి వెడలిన యీర్ష్యాపూరిత విమర్శనము వలన భగ్నచిత్తుఁడై "కీట్సు" అను నాంగ్లేయకవి స్నేహితుఁడైన షెల్లీకి "నేనుమరణించిన యనంతరము గొప్పకవినయ్యెదనుకాఁబోలు" అని వ్రాసినలేఖను జదివిన కిరాతుని హృదయమునందైన గరుణ మొలుకును. ఇట్టినిరుత్సాహకరసందర్భములందు " O! I sing for the mere joy of singing" అనుఉద్దేశమే కవిని అనందకవచునిగ నొనరించుచున్నది.

"ఓరి బాలక సీమురళీ రవంబు
వ్యర్థమౌనని చిత్తతాపంబువలదు.
రాగపరిచితుఁడెవ్వఁడో రమ్యగీతి
వినియొయుండు నానందంబు వెల్లివిరియు."

ఇట్లు.
దువ్వూరి రామిరెడ్డి.

# నక్షత్రమాల.

## కవిమనోరథము.

సాంధ్యకిమ్మీరవర్ణవస్త్రములు దాల్చి
గిరితటవిహారశృంగారకేళి సొలసి
రమణఁ జరియించుజలధరార్భకుని గాఁగ
    నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

ప్రత్యుషాశ్లేషమున విచ్చు ప్రసవమందుఁ
దరుణసూర్యాంశుమాలికాతరళకాంతి
మిళితమై రాలు తుహినాంబుకళిక గాఁగ
    నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

శిలలఁ బ్రవహించి, శీకరంబులను జల్లి
ప్రకృతిహృద్గతభావంబు బయలుపఱచు
గానముం జేయు మలయూఁటకాల్వ గాఁగ
    నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

శారదేందుమయూఖసంస్పర్శనముల
దైనికస్వప్నమాంద్యమ్ముఁ దలఁగఁ ద్రోసి
మొలకనవ్వులమేల్కాను కలువ గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

యామినీవ్యోమమండలప్రాంగణమునఁ
గవిమనోనందరాజ్యంబుఁ గాంచువేళఁ
గాంతి వెదచల్లు నక్షత్రకంబు గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

---

# ప్రణయాంజలి.

ఎవ్వతెయందు నామది లయించి తదన్యము చింత సేయదో
యెవ్వతె ప్రేమపూర్ణము సహింపగరాని వియోగగంధముల్
నివ్వటిల్లంగఁ జేసెడినొ, నిద్దురలందు సులభ్యయైన యా
జవ్వని మన్మనఃప్రణయసాక్షిగ మంగళ మొందుగావుతన్.

అల్లియుఁబూలు పూవని లతావళులట్టుల నామకోరికల్
గొల్లగ రేగియుం గుసుమపుంగూడకపోయె; మదీయపాపముల్
వెల్లువలౌచు నిద్దఱను వేఁచునరింపగ, దైవకూపమణం
బొల్లను;బూర్వకర్మఫలితోత్థితముల్ గద మోదఖేదముల్.

బయలం బ్రాఁకనిరంపకోతలకు నాభావంబు శుష్కించి లో
సయిపఁగరానివిషాదకష్టములమునన్ సంతోషలోకంబె యం
ధయుతంబై కళదప్పు, నానవసపుటుత్సాహంబు జీర్ణింప, స్వ
ప్నయథార్థంబునులౌకికంబనెడిత్రోవం బోయిచింతించుచున్.

నిమిషమైన రహస్యంబు నిలుపలేని
యద్దపుంబెట్టెలే మనయాత్మలైన
బట్టబయలుగ నిరువురిభావవృత్తు
లెఱుకపడునేమొ కన్నియా యింపు గలుగ.

కామదగ్ధంబునై, శాంతి గాంచి యున్న
భావభూతిని నిర్మలప్రణయలతిక
లల్లుకొని పూలు పూచె, నాయార్ద్రగంధ
మిరువుర మనుభవింపలేమే లతాంగి!

పండిపండని కోరికపంటభూమిఁ
బొరలి ప్రవహించు విరహనిర్ఝరిణికటులఁ
బ్రణయబంధంబు విచ్చి, పరస్పరాను
చింతలకు జలాంజలి యీయ సిద్ధపడెదొ?

అట్లుగాక, వెన్నెల గాయునట్టి రేల
వలపుసుధువాని చిత్తంబు భ్రమయుచుండఁ
జుక్కపూవులపందిరి సొగయుఁ, జేతఁ
బట్టెదో వట్టివేళుల వ్యజన మబల!

తలిదండ్రుల్ మనకోరికల్ సమయుయత్నంబింతగావించియుం
గలలం గల్లు మనోహరప్రణయసఖ్యంబుం దొలంగించిరే
చెలియా, యిద్దరిప్రేమబంధనము విచ్ఛిన్నంబుగాకున్నఁగాం
క్షలు దుస్సాధ్యము లయ్యుఁ గొంతదనుకన్ సంతోషమే
గూర్చెడిన్.

ఇంక నీలోకమున మన కిద్దఱకును
హృదయరక్తికి నాలంబ మొదవకున్నఁ
బ్రణయ మెల్ల ఫలించు స్వర్గమ్మునందు
ననుభవింత మానందరసామృతంబు.

కనులంగాటుకచీఁకటుల్ నెఱయఁ గ్రీగంట న్విలోకించి నా మనమ్ముఁమానఁగరానిగాయములనొంపఁ స్వప్నము ల్లేల చక్కనిదానా! పొడకట్టి దీవు; నను నింకం జిమ్మచీఁకట్ల వీణను వాయించి వియోగగీతి లయ మొందం బాడని మ్మొంటిగఁ.

---

# సంధ్య.

అరుణుఁడు పశ్చిమాద్రిశిఖరాంగణమునన్ డిగబాఱ వారిదో
త్కరశకలంబులన్ రుధిరకాంతులు పెల్లలరన్ దిశాంతముల్
పరగెఁ బరస్పరంబు నిరువాగుల వారలు పోర, రక్తని
ర్ఝరముల, నంగఖండములఁ గ్రాలురణస్థలు లట్లు దోఁచెడిన్.

భారతవీరపుంగవులు భాస్కరతేజు లపూర్వశౌర్యధు
ర్యావరులు ధార్తరాష్ట్రులును బాండునృపాలతనూజు లుర్వికై
ఘోరరణంబు సల్ప నటఁ గూలిన సైనికభగ్నకాయముల్
పేరిన యుద్ధరంగములలీలఁ జెలంగును బశ్చిమాశయున్.

క్షాత్రయుగంబునన్ భరతశౌర్యరమామణివారి కేళికిన్
శత్రుల శీర్షముల్ జలజషండముగాఁగ విభిన్నబాహువుల్
చిత్రమృణాలవల్లులుగఁ జెల్వగు శోణితపూర్ణసంగర
క్షేత్రసరోవరంబు విలసిల్లెనొ నా నపరాశ శోభిలున్.

కాంచగనే జపారుచిరకాంతులు మెల్లన నెల్ల లీనమై
కాంచనదీధితుల్ దిశలఁ గ్రమ్మఁ బురాతనభారతోర్వియా
పంచున జాఱువా గనిగ సంపదలం దులతూఁగుచుండెఁ బో
యంచుదలంపహేమమయమయ్యెనజాండముచూడనందమై

ఎఱలకు నేఁగు పక్షికులమెల్లఁ గులాయములంటి యాతురం
బఱచుచు వచ్చుటం గనఁగ భారతదేశసువర్ణసంపదం
బరధరణీజనుల్ గని యపారముదంబున దానిఁ దోఁచుకోఁ
బరుగిడి వచ్చిరో యనఁగ భావమునం బొడకట్టు వింతగన్.

అంతఁ గ్రమముగ సౌవర్ణకాంతి దిశల
మఱఁగ, నిబిడాంధకారంబు మల్లడించె
నతులభాగ్యంబు శౌర్యంబు నంతరింప
సొంపు దఱిగిన యార్యవసుంధర నటు.

ఎప్పుడు గాఢసంతమస మీవసుధ న్విడుఁ, బ్రాచ్యదేశ మిం
కెప్పుడు శోణితార్ద్రరుచి నింపులుచిల్కును, బాలభాస్కరుం
డెప్పుడు పూర్వమట్టుల రహించుఁ బ్రతాపసముజ్జ్వలంబుగా
నెప్పుడు మాను నో జలజశృంఖలరాయిడి బంధరాళికిన్.

# కవి.

వేగుజామున వికసించు విరులయందు
ఱేకు లెడలించుసంజపూరెమ్మలందుఁ
గావ్యమునఁ బోలెఁ బఠియింతుఁ గౌతుకమునఁ
బ్రకృతిసామ్రాజ్యపాలనాపద్ధతులను.

చటులకల్లోలరసనల సాగరంబు
పవలు రేయు నాలాపించు పాటలందు
ననితరగ్రాహ్యధర్మంబులై చెలంగు
విశ్వసృష్టిప్రకారముల్ వినుచు నుందు.

శ్యామలాకాశఫలకమునందుఁ దరళ
కాంతి వెదచల్లు తారకాక్షరము లొనరఁ
విశ్వవైశాల్యబోధకవిద్య నేర్తు
శర్వరీగర్భశాంతి యొజ్జగ విధింప.

గజురుతుంపరముత్యాలు కాన్క లిడుచుఁ
దరలు సెలయేఁటిపాటలో దాఁగియున్న
రాగతత్త్వంబు నామనిరాత్రులందుఁ
గూయుకోయిలకడ నేర్చికొందు వసుల.

స్వీయచరితారహస్యంబు వ్రాయఁబడిన
హృదయపుస్తకపుటముల ముదముతోడఁ
ప్రకృతి నామ్రోల విప్పఁ బ్రభాతరాగ
రంజితం బైన తూర్పుతీరంబునందు.

---

# కుసుమాశ్రువులు.

కమలా! లెమ్ము కుటీరకుడ్యముల బంగారంపు లేఁ బూఁతలం
గోమరారన్ రచియించె సూర్యకిరణాంకూరంబు లిప్పట్టునన్;
సుమముల్ గోయఁగ బొమ్ము, నాన్నజలముల్ జొబ్బిల్లునీర్ష్యావివ
స్త్రముతో స్నానము చేసి వచ్చెడిని పూజాసక్తచిత్తమ్మునన్.

అని జనయిత్రి వల్కు విని యంతఁ గుమారిక లేచి దంతధా
వన మొనరించి బృందకును భక్తిఁ బ్రదక్షిణ మాచరించి చ
ల్లని మలగాలిసోఁకి మొడలం బులక ల్మొలకెత్తఁ బైటకొం
గును బిగియించి తోఁటకడకుం జను దెంచె ననంటిడొప్పతోన్.

లేఁత పచ్చికతలలఁ జలించుచున్న
మంచు తుంపరము త్యాలు మగువనడచు
నపుడు నటునిటు జిందుచు నంఘ్రితలము
చలికి మొద్దువాఱెనోయనఁ జలపరించు.

అరుణమయూఖరంజితములైన హిమాంబుకణాళిముత్యపుం
సరములు ద్రెవ్విపో వరుసజాఱెడి పోలికఁ బూవు రేకులం
దొరఁగుటఁగాంచి యేమియును దోఁపక యాకమనీయదృశ్య
బంధురత మనంబు మగ్నమయి తోయ్యలి యాయనుభూతి
నుండఁగన్.

అమ్మ కమలా! బిరాన రావమ్మ యనుచుఁ
దల్లి పిలిచెనుగాని నితాంత పార
వశ్యముననున్న కమల యాపలుకులయిన
వినక తలపోయుచుండె నా విధములెల్ల.

ఎట్టులఁ జేతులాడునో కోయి యాకుసుమంబులఁ గోయఁ గాల్వలం
గట్టెడు నశ్రుబిందులటు గాఁ జెపుఁ బువ్వులనుండి మంచు బొ,
ట్లట్టెటు గాలికిం గదలినప్పుడు పువ్వుల మధ్యనుండి సొం
పుట్టుగ నవ్వెనాఁ బ్రకృతి, యుల్లము తాండవమాడు వేడుకన్.

కన్నుల విందు సేయు సుమకాండముఁ ద్రుంచి విచిత్ర శోభలన్
జెన్నొలికించు నీ ప్రకృతి చిత్తము నెత్తురు లొల్కఁ జేయ నే
నెన్నడుఁ బూన; లేఁ బొడువు కొండలు సోఁకినఁ బుల్కరించు పూఁ
బిన్నల హత్య చేయఁ దలపెట్టుట క్రూరము నన్నుఁ బోఁటికిన్.

ప్రకృతి రామణీయకమును బాడువెట్టి
దైవపూజకుఁ దొడగెను దండ్రియేమొ!
ఆత్మకుసుమసమర్పణం బాచరించి
వేదవేద్యునిఁ బూజింప వేడికొందు.

# రెడ్డికుల ప్రబోధము.

---

రెడ్లుగాఁబుట్టిన ఋణముఁదీర్చుకొనంగ
    వీక్షించితిరె కొండవీఁటికోటఁ !
దలఁచిన యంతఁ జిత్తమున రోషము రేఁపు
    కత్తుల రూపంబుఁ గాంచినారె !
రెడ్డివీరకుమార హృదయరక్తంబులఁ
    దోఁగిన రణభూమిఁ ద్రొక్కినారె !
యాంధ్రశౌర్యేందిర కకలంక భూషణం
    బౌ రెడ్ల చరిత విన్నారె ? యన్న
లార! యూరక రెడ్డికులాన జన్మ
మెత్తితిమఁటన్న ఘనతాయ మేమిగలదు ?
తల్లిమొగము నెఱుఁగని తనయు లవత
రించియును లేనివారలే యెంచిచూడ !

సచ్చిదానంద దర్శనుఁడు వేమనయోగి
    మనకులంబునఁ బుట్టెననిన జాలు ;
షట్చక్రవర్తి సచ్చారిత్ర నిర్మాత
    మనవాఁడె యన్న యాఘనతచాలు ;

ఆంధ్రవీరాంగనయైన నాయకురాలు
మనకులస్త్రీ యన్నమాటచాలు;
ఔదార్య ధుర్యాత్ముఁ డనవేమభూపుఁడు
మావాఁడె యన్నసంబరముచాలు;
నింక నెందఱెందఱినో యమీనయశులఁ
గాంచి లోకైక విఖ్యాతి గన్నయట్టి
రెడ్డికులపుఁ జారిత్రంబు శ్రేష్ఠమనుట
కేమిలోపంబుగలదు, మీ రెఱుఁగరయ్య.

ఘనసైన్యంబులఁగూర్చి బాహుబలవిక్రాంతి న్విశేషించి, ప
ద్మ నృపాలాళికి గుండెగాలముగ, విద్యానాథులై కొండవీ
టను నద్దంకిని రాజ్మహేంద్రపురిఁ గోటల్గట్టి శౌర్యంబునర్
మును బాలించిన రెడ్డిరాజుల యశంబుల్ నేఁటికిం గ్రాలవే!

మార్తుఱరాజ్యరమామణుల్ చెఱఁబడి
గోడుగుడిచినచోటు కొండవీడు;
ఆంధ్రదేశమతల్లి యలికంబునం డాల్చు
మండనతిలకంబు కొండవీఁడు;
కవితారసాలోల కల్లోలినిందోఁగు
పండితాఢ్యుల నాడు కొండవీడు;
ఖండితారాతిరాణ్మండన మండితా
ఖండలచాపంబు కొండవీడు;

అట్టివీటను బెన్గోట గట్టినట్టి
మేటిదిట్టలు మనతోంటి పోటుములెక !
నేఁటికిని రెడ్డి వీరుల నెత్తురచట
శౌర్యసౌరభ్యములు వెదజల్లుచుండు.

అరివీరకంఠనాళాస్త్ర ప్రవాహంబు
గవిసి త్రుప్పెత్తిన ఖడ్గధార;
భూగర్భమున రక్తపూరవిలీనమై
విశ్రమించిన బాహు వీర్యమహిమ;
కావ్యసంపుటబద్ధ గాథాశ్రయంబున
గ్రుక్కిళ్లువోవు నకుంఠకీర్తి;
బహుకాలవిశ్లేషభరమున శోషిల్లి
రమణఁవాసినయట్టి రాజ్యలక్ష్మి;
యింకనెప్పుడు పూర్వశౌర్యాంక సరణి
రెడ్డికులవీర దోర్బల శ్రీసమాశ్ర
యంబుగాంచి వర్ధిల్లునో ? యట్టియదను
గల్గునో ! మన కంత భాగ్యంబు గలదో ?

పోయిరివీరభద్రుఁ డనపోతమహీపతి వేమయోగియుం
బోయెను మల్ల రెడ్డికవి, పోయెను గాటయవేముఁడుర్వరణా
జేయకుమారవీరులును జెల్లిరి; రెడ్డికులంబు డొల్లయై
పోయెనటన్నలాఘవము పొందనిరీతి యశంబునిల్పుఁడీ;

పోయి రేగాని వారల భూతినుండి
రేఁగుచున్నది వెండియు రెడ్డిశక్తి;
యింక నొకమాఱులోకంబు నెల్ల నాత్మ
దివ్య తేజంబున న్ముంచి తేల్పఁగలదు;

పచ్చినెత్తురుటలల్ పై రేఁగు రణభూమి
జయనావ నడిపించు శౌర్యలక్ష్మి,
మోహనసౌరభ్యము ల్విసాళింపంగఁ
గవితాలతాంగి తోఁగలయు నేర్పు,
కీర్తివల్లికలు క్రిక్కిఱిసి దిక్కులకల్లఁ
గృతులందుకొన్న సాహిత్యరక్తి,
చేయొగ్గి యర్థులు జేపెట్ట సర్వస్వ
మైననిచ్చెడు నుదారాశయంబు,
హోమధూమావృతం బగ్నిహోత్రమటుల
సన్నగిల్లియుఁ, జావదు చావలేదు
ఇప్పటికి రెడ్డి కులమందు; నింకఁ జావఁ
బోదు మననెత్తురుకడపటి బొట్టువఱకు;

ఐరోపు విశ్వవిద్యాలయంబులయందు
హెచ్చుపరీక్షల నిచ్చివచ్చి,
యున్నతోద్యోగంబు లొంది కీర్తినిగాంచు
రామలింగారెడ్డి ప్రభృతులుండ,

పూర్వగంధము సుంత పోలివోక యిలనేలు
గద్వాల మునగాలత్మ్యోపులుండ,
ఆత్మకులోత్సాహ మతివేలముగ రేఁపు
కవుల కిన్నెరగీతి గడలుకోనఁగ,
ఈవియున్నతిచాటు నీటాను హాలు న
ర్పణ విడ్డరేబాల వంశమలర
కులము ఋణమెల్లఁ దీర్చితోఁ గోర్కెతోడ
బద్ధకంకణులై నిల్చి ప్రముఖులుండ,
మాతృ రథమేల పంకనిమగ్నమగును?
కొడుకులము లేమొ మోకులుదొడరిపట్ట.

కొండవీఁటి దుర్గంబునఁ గ్రుంకినట్టి
రెడ్డిసూర్యుండు కాళరాత్రిని దరించి
యభినవాంశు ప్రసారంబు లలరుచుండఁ
దూర్పుదిక్కున నల్ల దే తోఁచువాఁడు.

అనుమానంబొకయింత లేక గనుఁడీ యావచ్చు బాలార్కబింబ నవాంశుల్ ఘనమాలఁ జీల్చికొని సైపన్రానికాంతిచ్ఛటం గనులంగట్టుఁ; బ్రబోధగీతము లుషఃకళ్యాణి తారస్వరంబున నాలాపము సేయుచున్న యది పెంపుంబొంద నుత్సాహముల్.

సీడిపోయిన తంత్రులు బిగియఁగట్టి
హృదయమందుఁ బ్రేమగీతము లసఁగునటుల
వీణ సారించుచున్నాఁడు ప్రియసఖుండు
లెమ్ము నిద్దుర, రెడ్డికులమ్మ! యింక.

అరుగో! యూర్ధ్వపథంబునం గనుఁడు, దివ్యాకారముల్ దాల్చి కీ
ర్తి రమాకాంతులు, రెడ్డివీరులు గతోర్వన్ దేహముల్వీడి ని
ర్జరలోకంబున సౌఖ్యముల్ వారయుస్వార్థత్యాగు, లానంద ని
ర్భరచిత్తంబులఁ బుత్రులం గనఁగఁ జేరవ్వచ్చి, మందారపు
ష్ప రసౌఘాకుల బంభరారవ మిళద్భవ్యామలాశీరవం
బు రహింపన్ వెదజల్లువారలు సుమంబుల్ మోదబాష్పా
ర్ద్రిముల్.

నేఁడు పవిత్రవాసరము నిర్మలచిత్తముతోడ నందఱుం
గూడి కులాభివృద్ధికొఱకుం బనిసేయఁగ దీక్షఁబూని మీ
వాడలఁ బల్లెలన్ నగరవాటికలందుఁ బ్రబోధగీతముల్
పాడుడు, కంకణాలు మణిబంధములన్ ధరియింపుఁడర్థిమై.

ధనధాన్యంబులు ప్రాజ్యభోగములు విద్యాబుద్ధులుం గీర్తియు
న్ఘనశౌర్యంబు నుదారతాగరిమ చక్కంగల్గి తం గేడుపూ
చిన చందాన సతంబు నూత్నరుచులం జెన్నారుతన్ విశ్వమో
హనమై రెడ్డికులంబు సర్వజన నిత్యానందసంధాయిగన్.

---

# సోదరీస్మృతి.

---

చెల్లెలా! నీవు స్వర్గమ్ముఁ జేరికొన్ని
వత్సరంబులుగడచియుఁ బ్రకృతియందు
నీదుచిహ్నంబు లెల్లెడ నింపినావె
యనుదినంబును నాకు దర్శన మొసంగ.

శారదాంబుదమాలిక సడలిపోవఁ
గళలు దేఱిన శశిరేఖఁ గాంచినంతఁ
బొత్తిగుడ్డలు దొలగింపఁ బొనరునీదు
నాస్యబింబము తలఁపున నవతరించు.

ప్రత్యూషంబున మంచుతుంపరలతోడ
విచ్చు పన్నీటిపువ్వుఁ సేవించినంతఁ
దల్లికౌఁగిట మురిపెంబు వెల్లిగొలుపు
నీదుముద్దు మొగంబు వర్ణింపఁ జేయు.

సందెవేళలఁ బలుచని జలదములను
బూతపూచెడి చెంగావి పూలసౌరు
నవ్వునెడ నీదు చెక్కుల నాట్యమాడు
కాంతిమంజిమ మటునాకుఁ గానిపించు.

భౌతికంపు సంబంధము వాసియును ని
రంతరాధ్యాత్మిక ప్రణయంబు మనల
గడవరాని బంధంబులఁ గట్టివైచె,
స్వప్నవీథికి వచ్చెదే ప్రతిదినంబు.

# కోయిల

---

పైరుకోఁతలఁ గష్టించి పల్లెచెలులు
కొంత విశ్రాంతిఁ గొన్నారు కోయిలా, ర
సార్ద్రకంఠంబు నెత్తి గానామృతంబుఁ
జల్లుమా వారిమానసములు చల్లపడగ.

చిత్తరంజకరాగనిశ్శ్రేణి వైచి
దివ్యగానంబు భూమికి దింపరావె !
తంత్రు లెడలిన వల్లకీదండ మటులఁ
గూజితవిహీనమై తోఁచు గున్నమావి.

నీవు లేకున్న గగనవనీనికుంజ
తలములును బాడుపడినవిధానఁ దోఁచు !
నేడ కేఁగితో కోయిల యెమ్మెలాడి !
పాడరావమ్మ యొకమాఱు ప్రణయగీతి.

తేనెలూరెడి నీపల్కు తీయ్యఁదనముఁ
గోరి విరహులపోలికఁ గుందువారు
కవివతంసులు; వాసంతకాలలాంఛ
నంబవయి రావె కోయిలా సంబరముగ.

---

# స్వాతంత్ర్యరథము.

అంబుదంబుల నమృతపూరంబు లొలుక
నింద్రచాపంపుఁదోరణ మింపుఁ గులుకఁ
గాఱుమెఱుఁగులు నెల్లెడఁ గడలుకొనగ
వెడలె స్వాతంత్ర్యరథము విశ్వవీథి నందు.

జలధరమాలఁ జీల్చికొని స్యందనకాంతి నభోంతరాళము
జ్వలితముచేసి సుగంధసుమంబులు పూచిన మూలలనైన శో
భల నవలెత్తఁ జేయుచుఁ బ్రభాగనిభాకరబింబమట్లు సొం
పిలుచు నవీనజీవనము వింతగనింపె సమస్తసృష్టిలోన్.

ఆరథమందు దీప్తిమయమై కనుపట్టె నిజప్రభావదు
ర్వారపవిత్రమూర్తి కనుపండువుసేయుచు, ధర్మజీవనా
కారమొ! శాంతిబింబమొ! యకల్మషసత్యనికేతనంబొ నం
సారఫలస్వరూపమొ! ప్రజాహృదయంబొ! యనన్ వెలుం
గుచున్.

ఒకచేతఁ రుధిరంపుఁబాత్రమును వేఱొక్కంటఁ బీయూషపాత్రికయుం గైకొని సభ్యతామిషమునఁ దేశంబులందెల్ల నింతకు ధర్మంబులు గాఁగ నెన్నఁబడు నన్యాయంబు లీనాఁటితో వికలంబై చనుగాక యంచుఁ గరుణావేశమ్ము దీపింపఁగ.

వచ్చినెత్తుఱు నమృతంపుఁ బాత్రఁబోసి
దివ్యదుగ్ధంబుగా మార్చె దేవిమహిమ,
హాలహాలగర్భముందైన నమృతరసముఁ
సంభవించు నటం చిలఁ జాటనేమొ!

నిలువదు స్యందనంబు ధరణీపతిపాలన దండభీతిచే నిలువ దనాథబాష్పములు నిల్చిన పల్లవునేల, మోసగింపుల మఱపించు క్రించుఁదనపుంజతురాత్ముల కాఁగఁబో దనర్గళజవమొప్ప నేఁగెడిని గన్నులకుం గనరానిచోటికిఁ.

పూర్వసింహాసనంబులు, ప్రోజ్జ్వలంపు
మణిమయకిరీటములు భోగమందిరములు
చక్రసంఘర్షణంబునఁ జదిసిపోయి
యవి యివి యనంగరాక రూపఱెడు నేఁడు.

లేవు దివ్యతురంగముల్ లేవు కరులు
ప్రజలె యా తేరుమోకులఁ బట్టువారు
వాయుజవమునఁ దారకాధ్వమున నేఁగు
నంతరాయశతంబులనైన దాఁటి.

తేరుజాడల నెత్తురు పాఱిపాఱి
బంగరుంబంటఁ బండించె బక్కనేలఁ
జక్రనేములు దాఁకిన స్థలములెల్ల
సస్యలక్ష్మికిఁ గళ్యాణశాల లయ్యె.

స్యందనాసీన యగుదేవి "శాంతి శాంతి"
యనుచు మంజులగానమ్ము నలరఁజేసి
నవ్యనక్షత్రపీఠాసనమ్ములందు
మేళవించెను జనుల విస్మితులు గాఁగ.

---

# ప్రణయాహ్వానము

---

చెలియా ! వెన్నెలబైల మంచుతడిం బూచీపూవకున్నట్టి పువ్వులనెత్తావులు మోచి మోచి నిడియూర్పుల్గ్రోవునుద్యానకోమల మందానిలపోతముల్ మాలెం సన్మానింప వాతాయనంబుల డాయంజని ముద్దుంగౌంగిలి సుఖంబుంగూర్చి సేవించెడిన్.

చదలుపందెట వెన్నెలజాజితీవఁ
జుక్కలను పూలుపూచె రౌ సుందరాంగి
ప్రణయసమ్మోహనమ్మైన యీ ప్రకృతినెల్ల
సురభిళోచ్ఛ్వాస వీచికల సొగయ నూఁచు.

పరిసరోద్యానమునఁ జూతవాటియందుఁ
గలరవంబులు సల్పి పికద్వయంబు
నిస్తరంగ సరంబటు నెగడు రాత్రి
గర్భనిశ్శబ్దతకును భంగంబుఁగొల్పు.

చంద్రికాముగ్ధ శర్వరీచ్ఛాయలందు
జీవలోకంబు సుఖసుప్తిఁ జెందుచుండఁ,
గవిమనంబును బ్రకృతియుఁ గలయుచుండఁ,
బోదమా కాంత! సెలయేటి పొదలదరికి.

పులుగులు గూళులం జెదరిపోయినతెక్కలనొత్తికొంచుగొం
తులను బరస్పరంబు బిగిఁబోఁ బెనవైచెడివేళ, నెప్పుడుం
దెలుపని సాంద్రహాస్యములఁ దిన్నగ వీనుల విందు సేయనోఁ
జెలి, సెలయేటి సైకతముఁ జేరుదమా మన కేలియాఁతలన్.

జిలిబిలికమ్మగానములు చేసెడి యాసెలయేటి యొడ్డునన్
బులకల విస్తరిల్లి ననుఁబోడిమిఁ జూపుచు నీదు బుగ్గలన్
దోలఁకెడి సిగ్గుడాలుఁ గడదోఁపని ముద్దులఁ గ్రమ్మరించి యు
వ్వాల మధురోక్తులం గడిగివైచెదఁ గోమలి! రమ్ము మెల్లగన్.

# కొండవీడు.

---

సాంధ్యరాగాంకితాంభోదశకలచయము
లనెడి కీలల నిర్మగ్నుఁ డయ్యె నినుఁడు ;
శర్వరీకాంతకుంతలచ్ఛాయలందు
నెలవుకొనె విషాదపురామణీయకంబు.

కొండవీటిదుర్గంబునకు సమీప
మున నొకానొక కేదారమునఁ గృషీవ
లార్భకుఁడు దున్నుచుండి సూర్యాస్తమయము
గాఁగఁ దలపోయుచుండె నాగలిని విప్పు.

ఇటు దలపోసి పూనుకొను నెద్దుల నిల్పగ మేడినూనినం
తట మొనకఱ్ఱు లోఁదవిలి ధారుణిఁ జీల్పగ నందు వెండిసం
పుట మటు పున్కపై కుబుక భూతమటంచును గేకవైచి య
చ్చటఁ బనిసేయుతండ్రిఁ దనచక్కికిరాఁబిలిచెఁ భయంబునన్.

తనయుని వెత్తి కేకలకుఁ దందరలాడుచు వృద్ధుఁడేమిరా
యని పరుగెత్తి సీరపథమందునఁ బున్కనుజూపి బాలకుం
డను నిదియేమితండ్రి తలయాకృతిగల్గిన రాయి దున్నుచుం
డిన వసుధార్ద్రగర్భము వడి న్వెడలెం గనుఁగొమ్ము నావుడుఁ.

కృషికుఁ డంతటఁ బున్కను గేలనెత్తి
యశ్రుధారాభిషేకంబు నలవరించి
భయమునను సంభ్రమంబునఁ బలుకకున్న
తనయునిం గాంచి గద్గదధ్వని నచించె.

మాతృదేశపరాయణమానసులయి
సలిపి రిచ్చోట రెడ్డివీరులు రణంబు
కత్తిగంట్ల నమూల్యరక్తంబు దొరఁగి
కీర్తివల్లిక పాదు క్రిక్కిఱిసి నిండ.

శ్యామలాకాశవీథి నక్షత్రము లటు
కాలవాహినీతటములఁ గానిపించు
రెడ్డివీరకుమార చరిత్రపాద
చిహ్నములు, మృతశౌర్యంబు చివురువెట్టు.

అరివీరుల్, పులిగర్జలన్ విని కురంగానీకముల్ కానవాం
తరముం జొచ్చెడుపోలికన్ రణమునన్ ధైర్యంబువోనాడి యే
త్తెఱఁ బర్వన్, భుజవిక్రమంబు బలమున్ దీపింపఁ బోరాడి కీ
ర్తిరమం గాంచి ధరిత్రిగర్భమున శాంతిం బొందువారల్ నృపుల్

అట్టిశూరాగ్రగణ్యులయందు నొక్క
పురుషశిరముగఁ దోఁచు నీపుఱ్ఱ తనయ;
దీని వీక్షించినంతనే స్తిమితమైన
నాదురక్తంబు సైత ముష్ణముగఁ బాఱు.

అనవిని బాలకుండు, జనకా మనవారలెవారు వారికిన్
మనకును బూర్వ మెన్నఁడయినం గలచుట్టఱికంబుఁ దెల్పుమా
యనఁ, దలయూఁచి వృద్ధుఁడు, దిగంతములన్ బలమయ్యెఁ జీఁకటుల్
మనము గృహంబు సేరు నడమార్గమునన్ వచియింతునంతయున్

అని మొద్దులఁ బోఁదోలుచుఁ
దనయుండును దాను నింటిదారి నడచుచున్
మునుగొండవీటి నేలిన
జనవంద్యుల రెడ్ల పూర్వచరితలు వినిచెన్.

పూర్వవీరుల ధనువులఁ బొంగినట్టి
రక్తపూరంబె మనలోనఁ బ్రజ్వరిల్లుఁ
గాని, కాలభరంబునఁ గండలెల్ల
శాంతకర్షకవృత్తి దాస్యమునఁ దవిలె.

కత్తికి నడ్డులేక రిపు ఖండనలీలల నారితేరి భూ
పోత్తములెల్ల యశంబు గని యుర్విని బాలనచేసినట్టి రా
ష్ట్రతతి సీరచోదకవృత్తి గ్రహించిరి; పోటుకత్తులున్
నెత్తుటఁ ద్రుప్పుపట్టి చెడనేచెడె శూరత యంతరించుటన్.

వరవీరావళిహృత్పుటంబులను జీల్పన్ శక్తిమంతంబులై
దురమందున్ మెఱుపట్లు శోభిలినకత్తుల్ నేఁడు రూపాంతర
స్ఫురణన్ సీరములందుఁ గఱ్ఱులుగ నేర్పున్ సొంపువోనాడియీ
ధరణీగర్భముఁ జీల్చుచున్నయవి శాంతప్రక్రియం గోరుచున్.

ఒక్కక్షణంబునన్ గగన ముల్లసితంబుగఁ జేసి యుల్క వే
ఱొక్కక్షణంబులో మఱుగునోజగ రెడ్లప్రతాపవహ్ని న
ల్దిక్కుల నిండి యాంధ్రమహీ తేజము నిమ్మడిచేసి మోసపుం
డక్కు లెఱుంగకుంట నకటా! యలకత్తుల బావిఁ జెన్నఱెన్.

తళుకుఁబంగరుకోఁటిపై శతములం దావుల్ గుబాళించు పూ
వులగుత్తుల్ వెదచల్లుపుష్పములపొంపుం జిల్కు నీపాదచి
హ్నలవీక్షించి ప్రమోదబాష్పసలిలస్నాతంబులం జేసి ము
ద్దులువర్షించితిఁ జంచలాక్షి సుదతీయందుం బ్రేమ చిప్పిల్లఁగన్.

నీవు వసియించునీమకు నేనుఁగూడ
వచ్చెదను వేగఁ గొనిపొమ్ము వలపులాడి!
శీతలామృతవర్షంబుఁ జిందునీదు
సరసవీక్షా ప్రసాదభిక్షంబు పెట్టి.

అని యువకుండు పల్కి విని యాకవితాలలితాంగి ముద్దుమో
మునఁ జిఱునవ్వుదొంతరలు పొంపిరిపోవఁగఁ బాణిపల్లవం
బున వలిపంపుఁబయ్యెదను బొల్పుగనొత్తుచుఁ గాలియందెఘు
ల్లని రవళింప నేలపయి నల్లనఁ దా బొటవ్రేలు రాచుచున్.

వలపుల తేనెతుంపరలఁ బచ్చనిమానుల నెత్తు చిత్తపుం
గలతనుదోఁపనీక కలకంఠమునా వచియించె మోహనా,
వలికెదనోయి నీప్రణయబంధము; నవ్వఁడవీవు? స్వర్గపుం
బొలముల సంచరించు మముబోఁటుల సంగతిఁ గోరివచ్చితే?

నాదుబహిరాకృతిఁ గని యానందవార్ధి
నోలలాడిన వారెందఱో గలారు,
గాని, యెడలేనిప్రేమశృంఖలలఁ జిక్కి
నామనముఁ గొన్న ప్రియులు గానంగ నరుదు.

అవనిపై సంచరించు నీవంటివారు
దివ్య నక్షత్రమండలిఁ దిరుగఁగలరె?
అందరానిఫలంబుల కాసయేల
పొమ్ము, ననుఁబోలువారు మీభూమిఁ గలరు.

అనవిని యాయువకుఁడు కా
మిని! యిట్టులఁ ద్రోసిపుచ్చ మేలే, నీకై
యనురాగవశత నెట్టుల
దినములు గడపితినో దానిఁ దెలిపెద వినుమా.

అప్పుడైన నీహృదయంబు నందుఁ గొంత
నెనరుగల్గి నన్నేలెదో చనవులాడి,
వినియు నీప్రేమకుం దగ ననుచు భ్రుకుటి
భంగమాత్ర ననమ్మతి బయలు పఱతొ.

కవితాకోమలి, నీమనం బిడక యాకారంబుఁ గాన్పించి కై
తవలీలల్ పచరించి నాప్రణయగంధమ్ముః వృథా పుచ్చెదే?
యువకుండన్నఘుఁడార్ద్రచిత్తుఁడను స్నేహోల్లాసఘుర్యుండఁ బ్రా
భవకాంక్షః నను మోసగించియరుగః భావించితే నిర్దయః.

ప్రత్యూషస్సులనూత్నపత్రములు విచ్చి
విమలహిమబిందువులు రాల్చు సుమవితతుల
తోడఁ బ్రమదాశ్రువులు వీడి పాడుచుందుఁ
గలికి, నీమనం బంటెడు గానములను.

పారిజాతపుష్పంబులు పవనహతిని
మృదులతృణముల రాలెడునెడల, నీదు
చరణవిన్యాసకోమల శబ్ద మనుచు
నడుగుగుర్తులఁ బలుమాఱు నరయుచుందు.

సాలెగూళుల ముత్తెంపుసరములటుల
శీతగాలికి నల్లఁజలించు మంచు
నీటిబొట్ల మాలనుగట్టి నీదు మెడను
వైవఁదలపోసి యెగతాళిపడితిచెలియ.

గాఢనిశ్శబ్దశర్వరీ గగనమందు
నీవు పలికించు వల్లకీనినదములను
వినుచుఁ బ్రమదాశ్రుపూరంబు కనులఁదొరఁగఁ
గాంచుచుందు గభీరనక్షత్రవీథి.

వలపులు పండుపండమికి వందురుచుండెడు చిత్తమందు నెత్రులొలుక నడ్డుమాటలనుశూలనొంచెదెయాత్మహత్యకుం దలకొన దారిఁజూపెదవె, ధర్మమె నమ్మినవాని మోసగింపుల నలయించి చంప, నినుబోఁటికి నింతటికూరచిత్తమే.

గ్రామవాసిని, నెఱుఁగను గైతవంబు,
ప్రకృతి తల్లి స్తన్యంబునఁ బ్రబలినాఁడ,
బాలముల విహరించుచుఁ బ్రొద్దుఁ బుచ్చుచుందు,
నట్టినాముద్దువలపును నరయులేవె ?

అని యువకుండు పల్కఁగ రసార్ద్రమనంబున రేఁగుభావముల్ దానికెను బాష్పరూపములతోనఁ బ్రార్థనకొప్పికోలుగాఁ జనవుమెయిఁ మృణాళసదృశంబగుబాహువులెత్తి ప్రేయసుం దనకవుగింటనొత్తెఁ గవితాలలితాంగి విముగ్ధచిత్తయై.

# ద్రౌపదీసందేశము.

---

సంజయా, యింకఁజాలు నీశాంతిమార్గ,
మడవిఁబడరాని యిడుమలఁ బడితిమయ్య ;
బోధలానరించి హక్కులఁ బులిమిపుచ్చ
నిన్నుఁబంపెనె కురురాజు నేర్పుతోడ.

వగచినట్లుండవలయును, వానియాలి
త్రాడు తెగవలెనన్న విధాన నీవు
పూర్వకష్టంబులకు సానుభూతి చూపి
తేనెపూసిన కత్తిని దింపఁదలఁతె.

కపటమార్గంబులం బన్ని కనులు మూసి
రాజ్యభాగంబుగొన్న ధైర్యంబు కతన
నేఁడు సైతము మాటల నిద్రవుచ్చి
వనికి వెడలింపఁ గుట్రలు పన్నువారె?

మున్నటి దినాలుగావివి మోసములకుఁ
దవిలి తలయూచునే నేఁడు ధర్మరాజు ;
పరిభవానల కీలలు పాండుసుతుల
హృదయముల రగిలింపవే రేపుమాపు.

నను సభలోని కీడిచి, కనన్వినరాని పరాభవంబు చే
సినఁ గనులారఁ గాంచియునిసీ ! పతులేవురు ధర్మబద్ధులై
మును పగఁదీర్పకుంటఁ గురుభూపతిమమ్ములఁ జుల్కనాడెనం
ట! నిరతమొక్కరీతిఁ జనునా మన కాలము సంజయాయెటుల్.

అంతంబొందెని పాండుపుత్ర దృఢబాహాశక్తి రోషంబు; ను
ద్ధాంతప్రక్రియ వైరివీరమథన ప్రారంభకౌతూహల
స్వాంతుల్శాంతులుగారు కాలమెపుడో వచ్చుంగదా యంచు న
త్యంతాసక్తిఁ బ్రతీక్ష చేసెదరు శౌర్యాలంబులౌ మత్పతుల్.

రాయబారంబులేల యీరచ్చలేల ?
పాలుగొనక శాంతింతురే పాండుసుతులు ?
ఊరకిమ్మన్న నిచ్చునా యుర్వి నృపుఁడు ?
పిల్లిశాపంబులకునుట్లు ప్రిదిలిపడునె ?

తెలుపుము సంజయా, విరటుధేనువులం బరిముట్టువేళ ను
జ్జ్వలభుజవిక్రముల్ కురునృపాలవరుల్ చవిగొన్న పార్థుతూఁ
పుల దొనలింక రిత్తవడిపోవవు; గాండివి చిత్తమట్ల వై
రుల రుధిరంబుఁజూఱగొనరోషముఁగ్రక్కుశరంబులేనియున్

రాజ్యమేనాటికిని వీరభోజ్యమనుచు
జనులు పల్కెడిమాట నిశ్చయము సుమ్ము,
పరమసుఖములఁ దులదూఁగు నరవరుండు
పిలిచిరాజ్యంబులిచ్చునే భిక్షుకులకు.

బొల్లిమొగాలపైఁ జెమటబొట్టులు గ్రమ్మ సురక్షితంబులన్
బెల్లుగ నెత్తురోడికలు పేర్చగ నిమ్ము పృథాసుతుండు వి
ద్యుల్లతికాభ బాణములఁ దూలనడల్చి వధించుదాక మీ
యుల్లము రాజ్యభాగమున కొప్పునొ యొప్పదొ సూతనందనా!

వైరివిభీషణాకృతిని వాయుసుతుండు గదన్ ధరించి దు
ర్వారమదేభ మబ్జవనిపైఁ బడురీతిఁ గురూర్వినాథు లం
బేరు దలంపరానియటు వీనుఁగుపెంటలు సేయునప్డు దై
నా రవయేని నెంతురె మనంబునఁ బాండుతనూజశౌర్యమున్.

కవలనఁ బిల్లవారలటుగాఁ దలపోయుదు రేమొ! మీ పయిం
గవిసిన యప్డు వారి భుజగర్వము శౌర్యముగానవచ్చు; మ
బ్బు విడిచివచ్చుసూర్యుని సముజ్జ్వల తేజమునాగఁ జూడఁగా
నెవరును జాలరయ్యె రణమే త్తిఱి సల్పెడి బాలవీరులన్.

ఉత్తమాటలనేమి ప్రయోజనంబు
అవని యొసఁగుటో, లేకున్న నని సలుపుటో
చెప్పిపంపుడు ; నా మేన జీవమున్న
దనుక సంధియత్నంబులు దలఁగుడయ్య.

---

# దుర్యోధనుఁడు.

రాజరాజ! దుర్యోధనా! రాజ్యలక్ష్మి
నట్టనడియేఁటియందు నీపుట్టిముంచె
నయ్య, విధితిరస్కారంపు టవధిపోలె
నీదునంత్యపతన మింత నీచమగున!

**ఏలి**తివిధరావలయ మెంతటివీరుల కేని గుండెలో
గాలముగాఁగ వైరిబలగంబులకున్ యమదర్శనంబుగన్;
పాలకుఁ బోరుపెట్టు పసిపాపలు "వచ్చెను రాజరాజు"నన్
జోలిక నిద్రవోదురు కడు న్వెఱపెత్తఁగఁ బేరువిన్కలిన్.

**ఎ**ఱుఁగవె భీతియన్న నదియెట్టుల నుండునటంచుఁ బల్కు నీ
వెఱవమి విక్రమక్రమము వీర్యము నెక్కడపోయెనోయియా
సరసున డాగినాఁడవు, విచారములేదె? యశంబుకన్న న
శ్వరమగు ప్రాణముల్ మధురసంబులె? భారతకీర్తి నెంచవే.

హృదయముఁ గోసియిమ్మనినఁ బ్రీతిగ నిచ్చెడుప్రాణమిత్రుఁడే
యదవదలేక నీకయిరణావనిఁగూలిన కర్ణయోధ నీ
మదిఁ బొడకట్టఁడే, యిటుల మాన్యతపోవిడి తుచ్ఛజీవముం
బదిలము సేయనేల నరపాలక, వంశయశంబు నెంచుమా.

ఎంతకాలంబు బ్రతికిన నెప్పుడైన
మరణమొందక మానఁడు మానవుండు;
క్షత్రియునకు వ్యాధిబాధలఁ జచ్చుకన్నఁ
గత్తిపోటుల మడయుటే కరముప్రియము.

సాటిలేనివిరోధులఁ జదిపినట్టి
పరభయంకరగద చేతఁ బట్టినావు;
లెమ్ము లెమ్ము, దుర్యోధనా లెమ్ము లెమ్ము
క్షత్రియత్వమురూపింప వేళ లేదె?

ప్రవహింపదే నీదు రక్తనాళంబులఁ
బూర్వుల శోణితపూర మిపుడు,
ప్రజ్వలింపదె నీదు భావకుండంబున
నవమానరోషమహోమానలంబు,

తీరెనే నేఁటితో దిక్కులవిలసిల్లు
భారతక్షత్రియవంశకీర్తి,
గొడ్డువోయెనె నేఁడు కురురాజ్ఞి గాంధారి
కదనవీరశతంబుఁ గన్నతల్లి
లెమ్ము దుర్యోధనా యింక లెమ్ము లెమ్ము
సరసితటమున నున్నారు సమరకాంక్షు
లైన పాండవేయులును మురాంతకుండు
ప్రాణములపైన మోహంబు వదలుమయ్య.

ప్రాణమిత్రుండు కర్ణుండు స్వర్గమేఁగె;
నంపశయ్యను గాంగేయుఁ డస్తమించెఁ;
గొడుకులును దమ్ములునుగూడఁ గూలినారు;
అంత యభిమానమే దేహమందు రాజ!

గెలిచితివా యకల్మషపుఁగీర్తియు రాజ్యమునబ్బుఁ బ్రాణముల్
దొలఁగితివా నిలింపపురికోటలలో విహరింతువయ్య; శూ
రులకు రణంబు పం[illegible]సవు; విరోధుల గీటడగించి సర్వభూ
వలయము నైనఁ జావయిన భారతరాజ గ్రహింపు మిత్తెఱన్.

# రాధ యుత్కంఠ.

---

చల్లని పన్నీట జలకంబులాడి
యగరుధూపము వెట్టి యలకంబులార్చి
నుదుటఁ గస్తురి బొట్టు కుదుటుగాఁదీర్చి
కన్నుఁదమ్ములఁ గ్రొత్తకాటుక దిద్ది
గోరింటపూ గుత్తి కొప్పునం దురిమి
కమ్మతావులనీను కలపంబునలఁది
పొడికప్పురంబులఁ బడకింటఁ జల్లి
పాన్పుపైఁ బువ్వులు పఱపుగాఁబఱచి
యేలరాఁడో సామియింకేలరాఁడో
యనుచుఁ బారమునానుకొని వేచియుంటి

*        *        *        *

స్వాంతమాలస్యంబు సైరింపలేక
వేదనాభరమున వ్రీలంగఁజొచ్చెఁ
గనికనిదారులు కన్నులునొచ్చె
నాసామి కృష్ణుండు నను గాంచరాడు.
సంజకెంజాయలు శమియించిపోయెఁ

బక్షులు గూళ్లకుఁ బరుగిడసాగె
మందలకావులు మరలిపోయెడిని
వేణుగానంబులు వీనులసోఁకె
కోయిల క్రొమ్మావి గుబురులోఁ గూసె
సందెచీఁకటి పొగ చదలావరించెఁ
జుక్కల రసగుండ్ల జొంపంబులలరె
నేలరాఁడో కృష్ణుఁ డింకేల రాఁడో !

* * * *

కప్పూరపుందివ్వె కడముట్టవెల్గె
బాన్పుపైఁబువ్వులు పసివాళ్లువాడె
మంచిగందపుఁబూఁత మైఁ జిట్లిపోయె
నిద్రమాంద్యమ్మున నేత్రముల్వ్రాగిడెఁ
బడమటి దెసకేఁగు నుడు గణంబులను
గనుచు ద్వారముకడఁ గన్నుగూర్కితిని

* * * *

నాసిగ్గు పుచ్చంగ నలిన బాంధవుఁడు
వెయ్యి దివ్వెలతోడ వెలుగుచు వచ్చె

* * * *

కూర్కులేమిని గన్నుఁగొన లెఱ్ఱవాఱె
బొరలుచిట్టిన మేనిపూఁతలురాలెఁ
జెమ్మట ముత్యాలు చెక్కిళ్లజాఱె

ఘల్లుఘల్లని చేతిగాజులు మోయ
మజ్జిగఁ జిల్కుచు మధురగీతములఁ
గాంతుఁడొనర్చిన కఠినంపునేతఁ
దుమ్మెదపైఁ బెట్టిదూయుచునుండ
నాముద్దు కృష్ణుండు నావెన్కనిలిచి
ముసిముసి నవ్వుల మురియుచునుండె

*　　*　　*　　*

వేచియుండిన యప్డు విభుఁడరుదేఁడు
వేసవివానల విధముగా నతఁడు
కలవలె వచ్చును గనిపించిపోవు.

# ఎంత మోసము!

---

బాటసారి.

చీలుదారులఁ గూర్చుండి చిన్నదాన!
కన్నులను నీరు నించెదు కరుణమొలుక?
నేపథంబున నేఁగ నీ కిచ్చ గలదు?
ఇరులు గ్రమ్మకమున్నె ని న్నిల్లుసేర్తు.

చెట్లనీడలు విరివియై చేరెఁ దూర్పు;
సంజకెంజాయ పడమటఁ జిక్కనలమెఁ;
బైరుకోఁతల కేఁగిన పల్లెపడుచు
లింటికరుగుచుఁ బాడువా రేలపాట.

గాలితాఁకున వెన్నులు కదలునపుడు,
తిరుగఁ బాఱిన వరిచేలు తీయురాగ
మదిగొ వినఁబడుచున్నది, యలల మర్మ
రములు సంధ్యా ప్రశాంతగర్భమునఁ బోలె.

యువతి.

గోపికామోహనుఁడు నందగోపసుతుఁడు
వచ్చు నీదారి నని సఖి పలుకఁ వింటిఁ ;
బ్రొద్దుపొడుపున నుండి యీపొన్నక్రింద
వేచివేచి యీదారులు చూచుచుంటి.

రత్నఖచితకిరీటంబు రాజశిరము
నందు వెలుఁగొందుచుండు నటంచు వింటిఁ,
బట్టుపీతాంబరము వల్లెవాటు వైచి
మత్తకరినెక్కి వచ్చు నన్మాట వింటి.

బాటసారి.

చిన్నికృష్ణుని సేవింపఁ బొన్నక్రింద
వేచియున్నావె ? నీముందు వెళ్లినట్టి
వేణుధారినిఁ గాంచవే ? విశ్వమోహ
నంపుగానంబు వినవె యో నళినవదన.

నెమ్మిపించెము క్రొమ్ముడిఁ జిమ్ముజిగులు ;
చిన్నికూకట్లు మెడపైనఁ జిందులాడు ;
బొజ్జవఱకును వ్రేలు కెంబూలమాల ;
యతని పదశబ్దముల ఛంద మమరుచుండు.

అమహోత్సుఘాతులు సోఁకినంతమాత్ర
జీర్ణతరులతావళిగూడఁ జివురు వెట్టు ;
ఆమురళి మోహనారావ మలరినంత
రెల్లుపుల్లల సైతము రేఁగుగీతి.

యువతి.

ఇపుడు స్మృతియందు నావ్యక్తిమెసఁగుచుండు
భగ్నమైన యింద్రధనస్సుపగిది నహహా !
యెగిరిపోయెడు కలయట్లు లీక్షణముల
నంటి యింద్రజాల మదృశ్యమయ్యె నపుడె !

వేణుగానంబు దేనినో విన్నయట్లె
దోఁచుచున్నది, దూరానఁ దోయదములఁ
దారకావీణ లొనరించు ధ్వను లనంగ ;
నెంతమోసంబు జరిగె నోయీ సఖుండ !

బాటసారి.

అదియె తెలియరాని విచిత్ర మతివమిన్న.

గాంధీజీ క్షేమమునకై ఆతురతపడెను. రాజపుత్రస్థానములో సంచారము సల్పుచున్న రాజప్రతినిధికి ఢిల్లీకి రావలసినదనియు అత్యమూల్యమగు గాంధీజీ ప్రాణమును కాపాడవలసినదనియు వేలకొలది తంతివార్తలనంపిరి. దేశమంతట ప్రార్థనలు ఉత్సవములు జరుపబడెను. మహాత్మునకు వేలకొలది తంతివార్తలు వచ్చెను. అన్నిరాష్ట్రములందలి మంత్రులు రాజీనామాల నిచ్చెదమనిరి. కోట్లకొలది ప్రజలు ఆ మహాత్ముని ప్రాణమునకై అల్లలనాడిపోవుచుండిరి. మహాత్ముడులేని త్రిపురి కాంగ్రెసు దేవుడులేని దేవళమయ్యెను.

రాజప్రతినిధి ఢిల్లీకిచేరి గాంధీజీతో సంప్రదించి రాజకోట విషయమై తాను మధ్యవర్తిగ నిలచి సర్వమును పరిష్కరించెదననియు ఉపవాసదీక్షను విరమించ వలసినదనియు ప్రార్థించెను. రాజప్రతినిధి యందలి విశ్వాసముతో గాంధీజీ యుపవాస దీక్షను చాలించెను.

ధర్మేంద్రసింగు, చేసిన వాగ్దానమునకు భంగము గల్గించెనని మహాత్ము డనును. రాజు తనవాగ్దానమునకు పెడర్థములు కల్పించి చెప్పెను. ఇట్టి సందిగ్ధ సమస్యను రాజప్రతినిధి పరిష్కరింపవలెను. భారత ప్రధాన న్యాయమూర్తి చెప్పిన తీర్పు ననుసరించి నడువవలసినదని వైస్రాయి సూచించెను. గాంధీజీయు, ఠాకూరు సాహెబును అంగీకరించిరి.

గత ఏప్రిల్ మాసములో ఢిల్లీనగరమున విచారణలు జరిగెను. ప్రధాన న్యాయమూర్తి గాంధీజీ పక్షముననే

తీర్పు జెప్పెను. మహాత్ముడు విజయము నొందెను. ఈశుభ వార్త విని దేశీయులు, విదేశీయులు కడు ప్రసన్నులైరి.

ఇట్టి యోగిపుంగవునిగన్న భారతమాత కడుంగడు కృతార్థురాలు. మహాత్మునకు సమకాలికులమై జీవించు చున్న మనము ధన్యులము. యావద్భారత దేశమున మహాత్ముని నామము స్మరింపబడుచున్నది. ఆతని చిత్రము ప్రతి యింట నుంపబడి పూజింపబడుచున్నది.

యుద్ధజ్వాలలు ప్రపంచమంతట నావరించి రక్తబలి గోరుచున్న యిక్కాలమున మహాత్ముని పుణ్యమాయని భారతావని శాంతిగ వర్ధిల్లుచున్నది. మహాత్ముడు తన మాతృదేశమునకేగాక ప్రపంచ మంతటికిని సత్యాగ్రహముయొక్క విలువను చాటుచున్నాడు.

పశుబల ప్రాధాన్యముగల పాశ్చాత్యులు నివ్వెరబోయి చూచుచున్నారు.

లోకపూజ్యుడగు గాంధీజీ ఆయురారోగ్యవంతుడై తన మాతృభూమిని దాస్యశృంఖలములనుండి తప్పించుటకునై ఈశ్వరు డనుగ్రహించుగాత!

## —: మహాత్ముని ధర్మోపన్యాసము :—

"సత్యముకంటె వేఱుగా పరమేశ్వరుడున్నాడని నాకనుభవము లేదు. సత్యమునకు అహింసయే రాజమార్గము. వేరు

మార్గములేదు. వేయి సూర్యులయినను ఆ సత్య సూర్యునకు తీసికట్టు. సంపూర్ణమగు అహింస లేనిచో సంపూర్ణమగు సత్యము దొరకదు.

సర్వవ్యాపకుడగు నీ సత్యనారాయణుని ప్రత్యక్షదర్శనమునకై ప్రతి జీవిని తనవలెనే ప్రేమించు టత్యావశ్యము. సత్యభక్తియే నన్ను రాజకీయ రంగమునకీడ్చుకొని పోయినది. ఆత్మశుద్ధిలేనివా డహింసను పాలింపలేడు. వానికి ఆత్మ దర్శనము దొరకదు. ఒక పవిత్రవంతు డనేకుల పవిత్రవంతులుగ నొనర్చును. ఆత్మశుద్ధి నొందుటకు ప్రతివాడును మనోవాక్కాయ కర్మలచే నిర్వికారుడును, రాగద్వేషాది రహితుడును గావలెను. శస్త్రయుద్ధమును జయించుటకంటె మనోవికారముల జయించు టతి కఠినము.

అన్నిటికంటె తన యల్పత్వము మానవున కెంత వఱకు గోచరముగాదో అంతవరకును ముక్తిలేదు. ఈ వినయమునకు అహింస యెల్ల.

దేహపోషణకు ఆహార మెంత యవసరమో, మానసికాభివృద్ధికి ప్రార్థన మంతకంటె యెన్నియో మడుంగు లవసరము. మానవుడు దురహంకారుడై యున్నంతవరకు సత్యస్వరూపుడగు ఈశ్వరుడు వానికి తోడ్పడదు. ఆశలన్నియు అంతరించి అండలన్నియు దిగజారిపోయి నీవేదిక్కని పూర్ణవిశ్వాస మేనా డెవ్వడు పొందునో, వాని కీశ్వరసాయము తప్పక దొరుకును.

మహాత్ముడు తన్నిట్లు భావించుకొందునని చెప్పుచున్నాడు.

క. నావంటి కుటిలమతియుం
గావలుడుం, గాముకుండు కలడే యిలలో
ఏవాడు నాకు నోడలిడె
నావానినె మఱచునంత యకృతజ్ఞుండక.

పాఠక మహాశయులారా!

మహాయోగీశ్వరుడగు గాంధీజీ సయితము తన కింకను ఈశ్వరునియందు కృతజ్ఞత లేదనుచున్నాడు. ఇక మన మెట్టి కృతజ్ఞులమో యెఱుంగనగు.

మహాత్ముని జీవితమును జదివి సర్వవిధముల నామహానీయు ననుసరింతురు గాక.

సమాప్తము.

---

లక్ష్మి పవర్ ప్రెస్, తెనాలి. 1,00.. 6/30